సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023



అమ్మవారికి కోడితో మొక్కు, జంపన్న వాగులో శివసత్తి పూనకం, మొక్కులు

గద్దెల ప్రాంగణంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



జాతర.. జనం

మేడారంలో భక్తుల సందడి

మేడారం సమ్మక్క-సారలమ్మ మినీ జాతర ప్రాంగణం రెండో రోజు గురువారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు జంపన్న వాగులో స్నానాలు ఆచరించారు. మొక్కులున్న వారు తలనీలాలు సమర్పించి, ఎత్తు బంగారంతో తల్లుల గద్దెల వద్దకు చేరుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లిని కొలిచి మొక్కులు చెల్లించుకున్నారు. - ఎస్ఎస్ తాద్వాయి

8లో ▸

న్యూస్‌రీల్

ఖైదీలకు కంటి పరీక్షలు



ఎంజీఎం: కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా వరంగల్ రంగంపేటలో జైలు ఖైదీలకు గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్ని అడిషనల్ డీఎంహెచ్ఓ మదన్ మోహన్ ప్రారంభించగా.. శిబిరంలో 35 మంది ఖైదీలు, 102 మంది జైళ్ల శాఖ సిబ్బంది, రిటైర్డు ఉద్యోగులు పాల్గొన్నట్లు తెలిపారు. వీరిలో అవసరమున్న వారికి మందుల తోపాటు కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ షాలాల్ మసూద్, మెడికల్ ఆఫీసర్ నవత, జైలర్లు వెంకటేశ్వరస్వామి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నవీన్ మిట్టల్‌కు పాలక మండలి సభ్యుల సన్మానం



కేయూ క్యాంపస్: కళాశాల విద్య కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించి తాజాగా హైదరాబాద్ రెవెన్యూ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన నవీన్ మిట్టల్‌ను గురువారం కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సభ్యులు డాక్టర్ గుండాల మదన్‌కుమార్, డాక్టర్ నాగేంద్ర బాబు, డాక్టర్ చంద్రమౌళి కలిసి సన్మానించారు. పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు జిల్లా కోర్టులో కంటి పరీక్షలు

వరంగల్ లీగల్: జిల్లా కోర్టు ప్రాంగణంలో వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో న్యాయ సేవా సదన్ భవనంలో, జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెన్ కోర్ట్స్ భవనంలోని న్యూ బార్ హాల్‌లో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించనున్నట్లు రెండు జిల్లాల న్యాయమూర్తులు కె.రాధాదేవి, ఎం.కృష్ణమూర్తి, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్కుర్తి ఆనంద్‌మోహన్, ఎ.శ్రీనివాస్‌లు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు, సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వెంట ఆధార్ కార్డు తెచ్చుకోవాలని కోరారు.

మూడు రోజులు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: నగరంలోని వడ్డేపల్లి, కేయూసీ, దేశాయిపేట ఫిల్టర్ బెడ్ల పరిధిలో ఈనెల 6, 7, 9 తేదీల్లో తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు బల్దియా ఈఈ బి.ఎల్ శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధర్మసాగర్ రిజర్వాయర్‌కు సమీపంలో వాటర్ ప్లాంట్ వద్ద 2100 ఎం.ఎం.డయా పైపులైన్‌పై బటర్‌ఫ్లై వాల్వ్ ఏర్పాటు పనులు కొనసాగుతున్న నేపథ్యంలో నీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వరంగల్ అండర్ రైల్వే జోన్ ప్రాంతాల్లో నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నందున వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు కేయూ జట్టు ఎంపిక



కేయూ క్యాంపస్: తమిళనాడు రాష్ట్రం సేలంలోని పెరియారు యూనివర్సిటీలో ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు హ్యాండ్‌బాల్(పురుషుల) జట్టును ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ డాక్టర్ టి.సవితా జ్యోత్స్న గురువారం తెలిపారు. జట్టులో ఎ.టింక్‌లాల్, జి.ప్రేమ్‌సాయి, ఎ.గణేష్, కె.ఆనంద్‌కుమార్, జి.రమేష్, వి.సాయికిరణ్(సీకేఎం కళాశాల, వరంగల్), ఈ.కృష్ణ, యు.శివాజీ, కె.నాగరాజు, జె.సాయికుమార్, ఎ.సాయికృష్ణ, ఎస్.కళ్యాణ్(కేయూ వ్యాయామ కళాశాల), ఐ.రామాంజనేయులు, బి.సాయి(ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, ఖమ్మం), పి.నిఖిల్(ప్రియదర్శిని డిగ్రీ కాలేజీ, ఖమ్మం) ఎంపికైనట్లు తెలిపారు. జట్టుకు కోచ్‌గా సీకేఎం కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ బి.రమేష్, మేనేజర్‌గా కేయూ వ్యాయామ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు వ్యవహరిస్తారని తెలిపారు.

బడి.. నూతన ఒరవడి

'మన ఊరు-మన బడి'తో సరికొత్త సొబగులు

- 'కార్పొరేట్'లను తలపిస్తున్న సర్కారు పాఠశాలలు
- పల్లెలు, పట్టణాల్లో ప్రారంభోత్సవాల సందడి

సాక్షిప్రతినిధి, వరంగల్: సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుంది. గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులందరూ సర్కారు బడుల వైపు పరిగెత్తేలా కొత్త రూపును తీసుకొస్తోంది. ఇందుకోసం ఉమ్మడి వరంగల్ ఆరు జిల్లాల్లో మన ఊరు-మన బడి కింద అభివృద్ధికి ప్రభుత్వం పూనుకోవడంతో పాఠశాలలకు మహర్దశ పడుతోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 4,875 స్కూళ్లకు.. 2,984 పాఠశాలలను గుర్తించి.. తొలి విడతలో 964 బడుల్లో పనులు చేపట్టింది. రూ.241కోట్లు ఖర్చు చేసేందుకు అంచనా వేసింది. అయితే దశలవారీగా పూర్తవుతున్న పనుల్లో మరింత వేగం పెంచాల్సిన అవసరం ఉంది. పనులు పూర్తయి కొత్త రూపును సంతరించుకున్న పాఠశాలలు అధికారిక వేడుకలతో సందడి చేస్తున్నాయి.



జనగామ జిల్లా దేవరుప్పుల మండలం మొండిచింత తండా ప్రాథమిక పాఠశాల



సర్వాంగ సుందరంగా ముస్తాబైన పర్వతగిరి పాఠశాల

ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఇదీ పరిస్థితి

గుర్తించిన మొత్తం పాఠశాలలు	2,984
తొలి విడతలో మరమ్మతులు చేసేవి	964
అంచనా వ్యయం..	రూ.241కోట్లు
పనులు పూర్తయినవి	146
వివిధ దశల్లో ఉన్నవి	818

జిల్లాలవారీగా ఇదీ పరిస్థితి..

మన ఊరు-మన బడి కింద ప్రహరీ, అదనపు తరగతి గదులు, విశాలమైన డైనింగ్ హాళ్లు, కిచెన్ షెడ్లు, టాయిలెట్లు, మంచినీరు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, కూర్చునేందుకు బెంచీలు, భవనాలకు రంగులు, డిజిటల్ బోర్డులు, గ్రీన్ చాక్‌బోర్డులు వంటి 12 రకాల పనులు చేపట్టారు.

- హనుమకొండ జిల్లాలో 176 పాఠశాలలను ఎంపిక చేయగా.. రూ.30లక్షల బడ్జెట్ కన్నా ఎక్కువగా ఉన్న 42 స్కూళ్లను టెండర్ కాల్ కోసం వదిలిపెట్టారు. మిగతా 133 పాఠశాలల్లో ఎస్ఎంసీలతో పనులను మొదలు పెట్టారు. 13 పూర్తి కాగా.. మిగతా పాఠశాలల్లో పనులు వివిధ స్థాయిల్లో సాగుతున్నాయి.
- వరంగల్ జిల్లాలో 223 పాఠశాలలకు ప్రభుత్వం సుమారు రూ.58కోట్లకుపైగా నిధులు మంజూరు చేసింది. వీటిలో రూ.30లక్షలలోపు పనులు చేపట్టి 17 పూర్తి చేయగా.. 163 పాఠశాలల్లో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. అభివృద్ధి పనులు చేసే ఏజెన్సీలకు ప్రభుత్వం ఇప్పటికే అడ్వాన్స్‌గా రివాల్వింగ్ ఫండ్ నుంచి రూ.4.08కోట్లు చెల్లించింది.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 149 పాఠశాలలను ఎంపిక చేసి రూ.41.30కోట్లు మంజూరు చేశారు. 33 పాఠశాలల్లో మొత్తం పనులు పూర్తయ్యాయి. మిగతా చోట్ల పనులు పూర్తి చేసేందుకు అధికారులు తొందర పెడుతున్నారు.
- మహబూబాబాద్ జిల్లాలో మన ఊరు-మన బడి కార్యక్రమం కింద 316 బడులు మంజూరు కాగా.. తొలివిడతగా 116 పాఠశాలల్లో పనులు ప్రారంభించారు. డిసెంబర్ 31లోగా జిల్లావ్యాప్తంగా 32 పాఠశాలల్లో పనులు పూర్తి కాగా.. నెల్లికుదురులో అధికారికంగా ప్రారంభించారు. మిగతా చోట్ల పనులు వివిధ స్థాయిల్లో ఉన్నాయి.
- ములుగు జిల్లాలో 125 పాఠశాలలకు ప్రభుత్వం రూ.5కోట్లు మంజూరు చేసింది. 17 చోట్ల పనులు పూర్తి కాగా.. 50 పాఠశాలల్లో 90 శాతం మేర పూర్తి కాగా.. 38 చోట్ల 50-60 శాతం పనులు పూర్తి కావొచ్చాయని, 28 పాఠశాలల్లో ఇటీవలే ప్రారంభమయ్యాయని అధికారులు తెలిపారు.
- జనగామ జిల్లాలో 176 పాఠశాలలు ఎంపిక కాగా.. వీటి అభివృద్ధికి రూ.37,83,61,867 ఖర్చు చేస్తున్నారు. 31 పాఠశాలల్లో పనులు పూర్తి కాగా.. రూ.30లక్షలలోపు పనులు చేపట్టిన 131 పాఠశాలల్లో వివిధ స్థాయిల్లో సాగుతున్నాయి.

సుందరంగా తీర్చిదిద్దారు..



మా పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు 150 మంది విద్యార్థులు ఉన్నారు. ఏడుగురు ఉపాధ్యాయులం బోధిస్తున్నాం. మన ఊరు-మన బడి కింద పూర్తిస్థాయిలో తరగతి గదులు, మరుగుదొడ్లు, వంటశాల, తాగునీటి వంటి మౌలిక వసతులు కల్పించారు. డెస్క్ బెంచీలు కూడా వచ్చాయి.

- ఇంద్రసేనారెడ్డి, పాఠశాల హెచ్ఎం, నెల్లికుదురు

ప్రైవేటు స్కూల్‌లా ఉంది..



నేను ఒకటో తరగతి నుంచి ఈ పాఠశాలలో చదువుతున్నాను. అప్పుడు సౌకర్యాలు సరిగ్గా లేవు. మన ఊరు-మన బడి కింద మా పాఠశాలలో తరగతి గదులు, వంటగది, మరుగుదొడ్లు బాగు చేశారు. ప్రైవేటు పాఠశాలల కంటే బాగుంది. చదువుకోవాలనే ఆసక్తి పెరిగింది.

- గోనె అమృత వర్షిణి, 5వ తరగతి, నెల్లికుదురు పాఠశాల

'పరిశీలన' ప్రారంభం

- సర్వీస్ బుక్స్ పరిశీలనకు పది కౌంటర్లు
- సందడిగా మారిన డీఈఓ కార్యాలయం

విద్యారణ్యపురి: టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియతో డీఈఓ కార్యాలయం సందడిగా మారింది. జిల్లాలోని వివిధ సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు తమ సర్వీస్ బుక్, ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకుని గురువారం డీఈఓ కార్యాలయానికి తరలివచ్చారు. డీఈఓ ఎండి.అబ్దుల్ హై పర్యవేక్షణలో కార్యాలయంలో 10 కౌంటర్లను ఏర్పాటు చేశారు. పలువురు పీజీహెచ్ఎంలు, డీఈఓ కార్యాలయ సిబ్బంది సర్వీస్ బుక్స్, ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్, స్కూల్ అసిస్టెంట్ సోషల్, బయోసైన్స్, ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్, మ్యాథ్స్ ప్రభుత్వ జిల్లా పరిషత్ యాజమాన్యాలకు సంబంధించిన(తెలుగు, ఉర్దూ మీడియం) టీచర్లు తమ సర్వీస్ బుక్స్‌ను పరిశీలన చేయించుకున్నారు. అలాగే ఉపాధ్యాయ సమస్యలపై పీఆర్‌టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం.తిరుపతిరెడ్డి, జనరల్ సెక్రటరీ ఫలిత శ్రీహరి, టీఎస్ యూటీఎఫ్ జిల్లా జనరల్ సెక్రటరీ పెండెం రాజు, టీపీఆర్‌టీయూ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మన్నె చంద్రయ్య కూడా డీఈఓతో మాట్లాడారు. పలు అభ్యంతరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సీనియారిటీ జాబితాలోని తప్పులను సవరించాలని కోరగా.. అన్నింటినీ పరిగణనలోకి తీసుకొని సవరిస్తామని డీఈఓ తెలిపారు. దివ్యాంగుల సామాజిక వేదిక వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్, టీపీటీఆర్‌టీయూ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మన్నె చంద్రయ్య.. దివ్యాంగ ఉపాధ్యాయుల మెడికల్, సదరం సర్టిఫికెట్లను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. కాగా.. బదిలీల్లో అన్ని కేడర్లలో కలిపి 621 దరఖాస్తులు వచ్చాయి.



సర్వీస్ బుక్స్, సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

రెండుసార్లు తిరస్కరించి.. మళ్లీ..

గతంలో రెండుసార్లు పదోన్నతులకు అవకాశం వచ్చినప్పటికి పలు కారణాలతో తిరస్కరించిన పలువురు ఉపాధ్యాయులకు ఈసారి అవకాశం ఇవ్వడం లేదు. దీంతో తాము సీనియర్లుగా ఉన్నప్పటికి పదోన్నతి సీనియారిటీ జాబితాలో పేర్లు లేవని పలువురు డీఈఓ కార్యాలయానికి వచ్చారు. ఈ విషయాన్ని పలు సంఘాలు డీఈఓ దృష్టికి తీసుకెళ్లగా.. అప్పట్లో కొందరు ఉపాధ్యాయులు పదోన్నతులకు అవకాశం రాగా తిరస్కరించి తమ సర్వీస్ రిజిస్టర్‌లో ఎంట్రీ చేసుకోలేదని డీఈఓ తెలిపారు. అలాంటి వారిని గుర్తించి పదోన్నతుల సీనియారిటీ జాబితాలో చేర్చలేదని స్పష్టం చేశారు.

అభ్యంతరాల స్వీకరణ

టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు వివిధ కేటగిరీల సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు స్వీకరణ కొనసాగుతోంది. పలువురు ఉపాధ్యాయులు డీఈఓ కార్యాలయానికి వచ్చి తమ అభ్యంతరాలను తెలియజేస్తున్నారు. సీనియారిటీ జాబితాలను సవరించాలని కోరారు.

రుద్రేశ్వరాలయం తెలంగాణకే తలమానికం

హన్మకొండ కల్చరల్: నగరంలోని రుద్రేశ్వరాలయంలో అభిషేకం చేయడం గొప్ప అనుభూతి కలిగించిందని, ఈ ఆలయం తెలంగాణకే తలమానికమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. శ్రీరుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయాన్ని గురువారం సీపీ రంగనాథ్ దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ, ఇన్‌చార్జ్ ఈఓ జి.శేషగిరి వారిని పూర్ణకుంభం, ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతించారు. సీపీ దంపతులు స్వామివారికి పంచామృతం, మారేడు దళార్చన నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు, మహాదాశీర్వచనం, స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈనెల 18న జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు పోలీస్ శాఖ నుంచి విస్తృత ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.



అభిషేకం నిర్వహిస్తున్న సీపీ రంగనాథ్ దంపతులు

భద్రకాళి ఆలయంలో కలెక్టర్ పూజలు



కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను పూర్ణకుంభంతో స్వాగతిస్తున్న అర్చకులు



హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వరంగల్ కలెక్టర్ గోపి

హన్మకొండ కల్చరల్: బుధవారం రాత్రి బాధ్యతలు చేపట్టిన హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ గురువారం భద్రకాళి ఆలయాన్ని సందర్శించారు. కలెక్టర్.. అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి ఆలయానికి చేరుకోగా.. ఈఓ శేషుభారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు, అర్చకులు పూర్ణకుంభం, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కలెక్టర్ ముందుగా ఆదిశంకరుడు, వల్లభ గణపతి, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం వేదపండితులు తీర్థప్రసాదాలు, మహాదాశీర్వచనం అందజేశారు. భద్రకాళి శేషు కలెక్టర్‌కు ఆలయ చరిత్రను వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో వాసుచంద్ర, తహసీల్దార్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ

హనుమకొండ అర్బన్: హనుమకొండ కలెక్టర్‌గా బుధవారం రాత్రి బాధ్యతలు స్వీకరించిన సిక్తా పట్నాయక్‌కు వరంగల్ కలెక్టర్ గోపి, అధికారులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టరేట్‌లోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులతో కాన్ఫరెన్స్ హాల్లో పరిచయ సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి కృష్ణమూర్తి, వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్‌ను సిక్తా పట్నాయక్ మర్యాద పూర్వకంగా వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా వారు ఆమెకు పూలమొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న గ్రేటర్ కమిషనర్ ప్రావీణ్య, సీపీ రంగనాథ్

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్

వరంగల్ అర్బన్: హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సిక్తా పట్నాయక్‌ను గ్రేటర్ వరంగల్ కమిషనర్ ప్రావీణ్య మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసిన కమిషనర్ పూల మొక్క అందజేశారు.

'అడ్జెంట్ ప్రొఫెసర్ల' నియామకం
ఆదుకోండి ప్లీజ్..
ఆ రెండు పదవులూ రిజిస్ట్రార్‌కే..
పార్టీ ఆదేశిస్తే ఎన్నికల్లో పోటీకి సిద్ధం
- వివరాలు 10లో ▸

రాజన్న బిడ్డను.. ఆశీర్వదించండి

- అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తా..
- ప్రజాప్రస్థాన యాత్రలో వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల

చెన్నారావుపేట: 'వైఎస్.రాజశేఖరరెడ్డి సంక్షేమ పాలన తేవడానికే రాజన్న బిడ్డ మీ ముందుకు వచ్చింది.. ఆశీర్వదించండి, అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తా' అని వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం శంకరంతండాలో రెండు నెలల క్రితం ఆగిన చోట నుంచే గురువారం సాయంత్రం 4.30 గంటలకు వైఎస్.షర్మిల ప్రజాప్రస్థాన పాదయాత్ర ప్రారంభమైంది. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి పాదయాత్రను ప్రారంభించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలకగా.. ప్రజలు పూలవర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎలక్షన్లు వస్తున్నాయి.. కేసీఆర్ మళ్లీ వస్తాడు.. వారి ఎమ్మెల్యేలూ వస్తారు.. ఓటు వేసి మోసపోకండి అన్నారు. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో మీ ఓటు విలువైనది. ఆలోచించి ఓటు వేయాలని కోరారు. అనంతరం పాదయాత్ర తోపనగడ్డ మీదుగా నెక్కొండకు చేరుకుంది. కాగా.. శంకరంతండాకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి నాయకులు వైఎస్.షర్మిల సమక్షంలో వైఎస్సార్ టీపీలో చేరారు.



ప్రజలకు నమస్కరిస్తున్న వైఎస్.షర్మిల

పథకాల ఘనత రాజన్నదే..

నెక్కొండ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారని వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల అన్నారు. షర్మిల చేపట్టిన ప్రజా ప్రస్థాన పాదయాత్ర గురువారం సూరిపెల్లి క్రాస్ రోడ్డు నుంచి తోపనగడ్డ తండా మీదుగా నెక్కొండకు చేరింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైఎస్సార్ సంక్షేమ పాలన కోసం ప్రజలంతా మద్దతు ఇవ్వాలని కోరారు. కుటుంబంలో ఎంత మంది అర్హులుంటే అందరికి రూ.3వేల పింఛన్ అందిస్తామన్నారు. నెక్కొండలో ఎక్కడైనా డబుల్ బెడ్‌రూం ఒక్కటైనా ఇచ్చారా? అని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో కేసీఆర్ నియంత పాలన సాగుతుంటే ప్రతిపక్షాలు కాంగ్రెస్, బీజేపీలు ఏనాడైనా ప్రశ్నించాయా? అని ఆమె ప్రశ్నించారు. ఈకార్యక్రమంలో ఆపార్టీ రెండు జిల్లాల అధ్యక్షుడు నాడెం శాంతికుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి చల్లా అమరేందర్‌రెడ్డి, జిల్లా నాయకుడు భూక్యలాలునాయక్, నర్సంపేట, నెక్కొండ, చెన్నారావుపేట మండలాల అధ్యక్షులు నూనె నర్సయ్య, సురేందర్, జక్క వెంకటేశ్వర్లు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జాటోతు అశోక్‌నాయక్, అలువాల సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సిటిజన్ చార్టర్ అమలు చేయాలి : మేయర్

వరంగల్ అర్బన్: నిర్ణీత గడువులోగా సిటిజన్ చార్టర్‌ను పక్కాగా అమలు చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో పన్నుల విభాగం అధికారులు, సిబ్బందితో సిటిజన్ చార్టర్, సర్కిళ్లవారీగా ఆస్తి, నీటి పన్నుల వసూళ్ల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ సుధారాణి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సిటిజన్ చార్టర్‌ను పటిష్టంగా అమలు చేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్ల కేటాయింపు, ఆస్తి పేరు మార్పిడి, బైఫరిగేషన్, కొత్త అసెస్మెంట్ తదితర విజ్ఞాపనలు, సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలన్నారు. బల్దియా 2022-23 ఆర్థిక సంవత్సరానికి పన్నుల సేకరణ లక్ష్యం రూ.91.96కోట్లు కాగా.. ఇప్పటివరకు రూ.50.06కోట్లతో 55 శాతం పన్నులు వసూలు చేశారని పేర్కొన్నారు. 100 శాతం పన్నుల లక్ష్యాన్ని సాధించడానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. సమీక్షలో డిప్యూటీ కమిషనర్ జోనా, ఐటీ మేనేజర్ రమేష్, ఆర్ఓలు సుదర్శన్, షహజాది బేగం, యూసుపొద్దీన్, శ్రీనివాస్, ఆర్ఐలు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

'దానాపూర్'లో 27మంది బాలల తరలింపు

- రక్షించిన ఆర్‌పీఎఫ్ సిబ్బంది
- ఆరుగురు నిందితుల అరెస్ట్

కాజీపేట రూరల్: దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో అక్రమంగా 27మంది బాలలకు హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే సమాచారంతో కాజీపేట–సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య బుధవారం రాత్రి బచ్‌పన్ బచావ్ ఆందోళన్ సభ్యులు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు చేపట్టి బాలలను రక్షించారు. ఈ సందర్భంగా గురువారం ఆర్‌పీఎఫ్ అధికారులు విలేకర్లకు వివరాలు వెల్లడించారు. కర్మాగారాల్లో బాలలతో పనిచేయించేందుకు తరలిస్తున్నారనే సమాచారంతో దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌ను బల్లార్షా నుంచి ప్రత్యేక బృందం తనిఖీ చేసుకుంటూ కాజీపేట జంక్షన్‌కు చేరుకుంది. వారి ఆచూకీ దొరకకపోవడంతో మిగతా సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ సెక్యూరిటీ కమిషనర్ దేబస్మిత బెనర్జీ నేతృత్వంలోని బృందం, కాజీపేట ఆర్‌పీఎఫ్ సీఐ సంజీవరావు, ఎహెచ్‌టీయూ కాజీపేట, వరంగల్ బృందాలు, బచ్‌పన్ బచావో ఆందోళన్ సభ్యులు రంగంలోకి దిగారు. ధానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలును క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ రైలు సికింద్రాబాద్‌కు వెళ్లే సమయానికి 27మంది బాలలను రక్షించారు. బాలలను అక్రమంగా తరలిస్తున్న బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌కు చెందిన ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి సికింద్రాబాద్ ఆర్‌పీఎఫ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు.

ప్రకటన

ఇందుమూలంగా సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు అయిన **శ్రీ కొండము వసుందర్, తండ్రి: రాములు,** వయసు: 49 సం॥లు, వృత్తి: Govt. Employee, R/o. H.No. 1-67, ఎల్లంపేట్, వరంగల్ జిల్లా గారల లింక్ డాక్యుమెంటు అయిన రిజిష్టరు సేల్ డీడ్ నెం. 1134/1982 ద్వారా ఖరీదు చేసిన, విస్తీర్ణము 300 చంగజములు, సర్వే నెం. 100/D, 100/C, 101/K, భాజీపేట జాగీరు శివారులోని రిజిష్టరు, సేల్‌డీడ్ నెం. 6158/2009 ద్వారా కొంత భాగం ఖరీదు చేసుకుని ఉండెను. కావున సదరు ఆస్తి ఈ దిగువ షెడ్యూల్‌లో చూపబడింది. మొత్తముపై ఎవరికైనా ఏ విధమైన అక్షేపణలు, హక్కులు ఉన్నచో, తగు సాక్ష్యాధారాలతో ఈ దిగువ సంతకం దారునకు, ఈ ప్రకటన వెలువడిన 7 (ఏడు) దినములలో తెలుపగలరు. తర్వాత వచ్చు అభ్యంతరాలు చెల్లనేరవు మరియు నా క్లయింటు పోగొట్టుకున్న సేల్‌డీడ్ నెం. ఒరిజినల్ దస్తావేజు 1134/1982 ఎవరికైనను దొరికినచో ఈ దిగువ సంతకం దారునకు 7 దినములలో తెచ్చి ఇవ్వగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును. 7 దినముల తర్వాత వచ్చు అభ్యంతరములు అంగీకరించబడవు. కావున నా క్లయింటు ఈ దిగువ షెడ్యూల్ ప్లాటును అమ్ముటకు శ్రీ కొత్తపల్లి రాంమోహన్, తండ్రి: సాయిలు, నివాసం: వర్మాల గారితో అగ్రిమెంటు చేసుకుని ఉన్నారు. ఎవరికి, ఏమి అభ్యంతరం లేనిచో, 7 (ఏడు) దినముల తర్వాత సదరు శ్రీ కొత్తపల్లి రాంమోహన్, తండ్రి: సాయిలు సదరు షెడ్యూలు ప్లాటును రిజిష్టరు చేయించుకోగలరు. ఈ ప్రకటన నా క్లయింటు ఇష్టపూర్వకంగా జారీచేయనైనది.

Sd/- **A. BHASKAR,** B.Com., LL.B.
Advocate
H.No. 19-2-76, Rangasaipet, Warangl (T.S), Cell: 9949185230
Dt: 02-02-2023.

పత్రికా ప్రకటన

ఇందుమూలంగా నమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా! నా క్లయింట్ అయినటువంటి **సంగి అంజయ్య, తండ్రి: కట్టయ్య,** నివాసం: రాంపూర్, ఖాజీపేట్ మండలం, హనుమకొండ జిల్లా వాస్తవ్యులు. నా క్లయింట్, వారికి వారసత్వంగా వారి తండ్రి గారి నుండి రావల్సినటువంటి హనుమకొండ జిల్లా లోని ఖాజీపేట్ మండలం, రాంపూర్ గ్రామము లోని సర్వే నెం. 16/బి/1 లోగల ఎ. 4-00 గుంటలు మరియు 17/బి లో గల ఎ. 3-03 గుంటల మొత్తము ఎ. 7-03 గుంటల వ్యవసాయ భూమి వచ్చియున్నది. అప్పటి నుండి ఈ రోజు వరకు నా క్లయింట్ ఆధీనములోనే మరియు వారు కౌలుకు ఇవ్వడం జరుగుతున్నది. ఇట్టి స్థిరాస్తిపై గౌరవ శ్రీ హనుమకొండ జిల్లా ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ గారి కోర్టులో దావా నెం. O.S.No. 155/2023 మరియు I.A.No. 67 of 2023. ఇట్టి స్థిరాస్తికి సంబంధించిన **హద్దులు: తూర్పు:** ఎన్. కనకయ్య గారి వ్యవసాయ భూమి, **పడమర:** ఎన్. ఎల్లయ్య గారి వ్యవసాయ భూమి, **ఉత్తరం:** దారి, **దక్షిణం:** ఎం. జంపయ్య గారి భూమి. కావున, సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! పై వ్యవసాయ భూమిపై నా క్లయింట్స్ గారికే చెందినది. కాబట్టి అట్టి భూమి క్రయ విక్రయాలు చేయరాదని, ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని తెలియపరచుచున్నాము. ఒకవేళ ప్రకటనను పరిగణలోకి తీసుకొనకుండా ఎవరైనా క్రయ విక్రయాలు, నిర్మాణాలు చేపట్టిన యెడల, మా క్లయింటు తీసుకొను సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులవుతారని తెలియపరచడమైనది.

ఇట్లు : సం/- **సి.హెచ్. భరత్ కుమార్**
పోరండ్ల నాగరాణి
అడ్వకేట్స్ - హన్మకొండ. సెల్: 9440308252


వన దేవతలను మొక్కుతూ..


బంగారంతో వనదేవతల సన్నిధికి వస్తున్న భక్తులు


చిన్నారి పుట్టువెంట్రుకలు తీస్తూ..


క్యూలో..

గద్దెల వద్ద భక్తులు



గద్దె నుంచి వెళ్తూ..



ఎత్తు బంగారంతో..



తల్లులకు సంప్రదాయంగా పూజలు

రెండవ రోజు మేడారం, కన్నెపల్లిలో పూజారుల పూజలు

- భక్తులతో కిక్కిరిసిన గద్దెల ప్రాంగణం
- తరలివచ్చిన వేలాది మంది భక్తులు

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మ మినీజాతరకు భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. మండమెలిగె పండుగ సందర్భంగా గురువారం రెండవ రోజు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం సమ్మక్క, సారలమ్మ పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం రాత్రి మేడారంలోని సమ్మక్క, సారలమ్మ గద్దెలకు చేరుకున్న పూజారులు, రాత్రంతా జాగారం చేశారు. గురువారం ఉదయం పొద్దుపొడవక ముందే 7 గంటల సమయంలో సమ్మక్క పూజారులు సమ్మక్కను గద్దె పై ఉంచిన పూజా సామగ్రిని తీసుకొని డోలువాయిద్యాల, బూరకొమ్ముల శబ్దాల నడుమ మేడారంలోని సమ్మక్క గుడి చేరుకున్నారు. పూజారులు గుడికి వెళ్తున్న దారిలో ఆడపడుచులు ఎదురెళ్లి నీళ్లు ఆరబోసి మొక్కుకున్నారు. పూజారులు తలస్నానాలు ఆచరించిన అనంతరం గుడిలో సమ్మక్క తల్లికి యాటను మొక్కుగా సమర్పించి నైవేద్యంగా పెట్టారు. రెండవ రోజు దూప దీపాలు వెలిగించి పూజలు చేశారు. గద్దెల నుంచి సారలమ్మ పూజారులు కన్నెపల్లి చేరుకున్నారు. సారలమ్మ గుడిని శుద్ధి చేసి పసుపు, కుంకుమలతో అలంకరించి, సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య దూప దీపాలు వెలిగించి అమ్మవారికి యాటను నైవేద్యంగా సమర్పించారు. మేడారం, కన్నెపల్లి ఆదివాసీలు, గ్రామస్తులు అమ్మవారి ఆలయాలకు వెళ్లి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క సారలమ్మ పూజారులు వారి వారి ఇళ్లలో కూడా అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆకట్టుకుంటున్న మ్యూజియం

మేడారంలోని ఆదివాసీ సమ్మక్క–సారలమ్మ మ్యూజియం భక్తులను ఆకట్టుకుంటోంది. మ్యూజియంలో పురాతన కాలంలో ఆదివాసీలు ఉపయోగించిన పనిముట్లు, వారి జీవన శైలి విధానం, గిరిజన గూడాల చిత్రాలు ఆకర్షణీయంగా నిలిచాయి. మ్యూజియం అసిస్టెంట్ క్యూరేటర్ కురసం రవి భక్తులకు మ్యూజియంలోని ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాల తీరును వారికి వివరించారు.

గద్దెల ప్రాంగణంలో..

రెండవ రోజు మండమెలిగె పండుగకు వేలాదిగా తరలివచ్చిన భక్తులతో గద్దెల ప్రాంగణం కిక్కిరిసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మేడారానికి తరలివచ్చారు. జంపన్నవాగు షవర్ల కింద స్నానాలు ఆచరించారు. సమ్మక్క– సారలమ్మ గద్దెల వద్ద పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం, ఒడి బియ్యం, చీరసారె కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి మొదలైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు యాథావిధిగా కొనసాగింది. భక్తుల రద్దీ పెరగడంతో అధికారులు క్యూలైన్ల ద్వారా భక్తులను దర్శనానికి పంపించారు. ఈఓ రాజేంద్రం భక్తుల ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. దర్శనం అనంతరం భక్తులు మేడారం పరిసరాల్లో వంటావార్పు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వరరావులు జాతరలో భక్తుల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గద్దెల ప్రాంగణంలో దొంగతనాలు జరగకుండా సీసీఎస్ సీఐ రవీందర్ పర్యవేక్షణలో పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. కొంతమంది అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని వారి వివరాలు సేకరించి వదిలేశారు.


గద్దెల నుంచి వనదేవతలను తీసుకెళ్తున్న పూజారులు


జాతకం చూస్తున్న కోయదొర


జంపన్నవాగులో వరం పడుతూ..


పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు


మేడారం వ్యూ..


ట్రాక్టర్‌లో వెళ్తూ..

నేటి నుంచి వీనస్ జ్యువెల్లర్స్‌లో..

- డైమండ్స్ ఎగ్జిబిషన్, సేల్

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ రోడ్డులో గల వీనస్ జ్యువెల్లర్స్ షోరూంలో నేటి నుంచి 5వ తేదీ వరకు డైమండ్స్ ఎగ్జిబిషన్, సేల్ జరుగుతుందని షోరూం చైర్మన్ రవిచంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగ్జిబిషన్‌లో ఒక క్యారెట్‌పై రూ.3వేల ప్రత్యేక రాయితీ ఇస్తున్నట్లు వివరించారు. ఐజీఐ సర్టిఫైడ్ డైమండ్స్ ఎగ్జిబిషన్‌లో అమ్మకాలు ఉంటాయని తెలిపారు. 36 సంవత్సరాలుగా ఎందరో కస్టమర్ల ఆదరణ చూరగొన్నామని పేర్కొన్నారు. ఈ డైమండ్స్ ఎగ్జిబిషన్, సేల్ అవకాశానికి సద్వినియోగం చేసుకోవాలని రవిచంద్ర కోరారు.

సెల్‌ఫోన్ల దొంగలు చిక్కారు..

- 47 సెల్‌ఫోన్లు.. ఒక లాప్‌టాప్ స్వాధీనం

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీతో పాటు వివిధ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు దొంగతనానికి పాల్పడుతున్న దొంగలు పోలీసులకు చిక్కారు. దొంగల వివరాలను సీఐ దయాకర్ గురువారం వివరించారు. కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెగడపల్లి డబ్బాల వద్ద ఇద్దరు అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఎస్సై విజయ్ బృందం వారిని గుర్తించిందని తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేసి విచారించగా వరంగల్‌కు చెందిన చాపర్తి రాజేష్, గుండ్ల వెంకటేష్‌గా తెలిసిందన్నారు. వారి వద్ద 47 సెల్‌ఫోన్లతో పాటు లాప్‌టాప్ లభ్యమైందన్నారు. ఈ సెల్‌ఫోన్లను విక్రయించడానికి వెళ్తున్న క్రమంలో వారు పట్టుబడినట్లు దయాకర్ వివరించారు. వాటి విలువ సుమారు రూ.7.40లక్షలుగా ఉంటుందని తెలిపారు.

ఎంట్రన్స్ కేంద్రాలే టార్గెట్

చాపర్తి రాజేష్, గుండ్ల వెంకటేష్‌లు ముఖ్యంగా సెల్‌ఫోన్లు దొంగతనం చేయడమే లక్ష్యమని తెలిపారు. పోటీ పరీక్షలకు కేటాయించే ఎంట్రన్స్ కేంద్రాలే టార్గెట్‌గా ఎంచుకునే వారని వివరించారు. ఇటీవల కేయూలో ఎంట్రన్స్ రాయడానికి వచ్చిన 22మంది విద్యార్థులు ఒకే బ్యాగ్‌లో మొబైళ్లు పెట్టి వాటిని స్కూటీ డిక్కీలో భద్రపరిచి పరీక్ష రాసేందుకు వెళ్లారని తెలిపారు. ఇది గమనించిన నిందితులు ఆ మొబైళ్లను మాయం చేశారని చెప్పారు. దూర విద్యాకేంద్రం వద్ద కూడా పలు స్కూటీ డిక్కీల్లోని ఫోన్లు మాయం అయ్యాయని తెలిపారు. అదే విధంగా పోలీస్ సెలక్షన్స్ సందర్భంగా అభ్యర్థులు భద్రపరుచుకున్న డిక్కీల్లో నుంచి సెల్‌ఫోన్లు మాయం చేశారని వెల్లడించారు. సెల్‌ఫోన్ల మాయంపై పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదు అయ్యిందని తెలిపారు. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై విజయ్, కానిస్టేబుళ్లు అహ్మద్ పాషా, సంపత్, అనిల్‌ను సీఐ అభినందించారు.


హసన్‌పర్తి: మాట్లాడుతున్న సీఐ దయాకర్

ఫైనల్స్‌కు చేరిన 'సాక్షి' క్రికెట్ పోటీలు


మొదటి మ్యాచ్ విజేత నిట్


రెండో మ్యాచ్ విజేత వాగ్దేవి కళాశాల

- పోటీలను ప్రారంభించిన ఏసీపీ గిరికుమార్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏసీపీ

రామన్నపేట : వరంగల్ ములుగు రోడ్డులోని లాల్ బహదూర్ కళాశాలలో ఆరు రోజులుగా హోరాహోరీగా సాగుతున్న క్రికెట్ పోటీలు తుదిదశకు చేరుకున్నాయి. గురువారం సెమీఫైనల్ మ్యాచ్‌లో పలు జట్లు తలపడగా శుక్రవారం నిర్వహించే ఫైనల్‌కు సీనియర్ విభాగంలో వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, నిట్ కళాశాల జట్లు ఎంపికయ్యాయి. జూనియర్ విభాగంలో ఎల్బీ కళాశాల జట్టు, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల జట్లు ఎంపికయ్యాయి.

క్రీడాపోటీలతో మానసిక స్థైర్యం

క్రికెట్ మ్యాచ్‌ను గురువారం వరంగల్ ఏసీపీ గిరికుమార్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీలు మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఉదయం మొదటి మ్యాచ్ నిట్ వర్సెస్ బిట్స్ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెల్చుకున్న నిట్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన బిట్స్ కళాశాల జట్టు 10 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 72 పరుగులు సాధించింది. అనంతర బ్యాటింగ్ చేసిన నిట్ జట్టు 6.3 ఓవర్‌లలో లక్ష్యాన్ని ఛేధించింది.

రెండవ మ్యాచ్‌లో..

రెండవ మ్యాచ్‌లో వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు, ఆర్ట్స్ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెల్చుకున్న వాగ్దేవి జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 10 ఓవర్‌లలో ఐదు వికెట్ల నష్టానికి 81 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆర్ట్స్ అండ్ కళాశాల 8 వికెట్ల నష్టానికి 62 పరుగులు మాత్రమే సాధించింది. దీంతో 19 పరుగులు తేడాతో వాగ్దేవి కళాశాల జట్టు విజయం సాధించింది.


క్రికెట్ మ్యాచ్ ఆడుతూ..

న్యాయం చేయాలని..

- వృద్ధ దంపతుల ఆందోళన

తొర్రూరు: వృద్ధాప్యంలో ఉన్న తమను కుమార్తెలు వేధిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని వృద్ధ దంపతులు అక్కిరెడ్డి సత్తిరెడ్డి, సోమనర్సమ్మలు ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్ కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట గురువారం మండల పరిధిలోని దంతాలపల్లి రామానుజపురం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు ఆందోళన చేపట్టారు. వృద్ధాప్యంలో తమను పట్టించుకోని కుమార్తెల గిఫ్ట్ డీడ్ భూమి రద్దు చేయాలని ఆర్డీఓ రమేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నలుగురు కుమార్తెలకు వివాహాలు చేసి 9.27 ఎకరాల భూమి గిఫ్ట్ డీడ్ కింద పట్టా చేశామని తెలిపారు. వృద్ధాప్యంలో తమ అవసరాల నిమిత్తం 3–36 ఎకరాలు ఉంచుకున్నామని, నలుగురు కుమార్తెల్లో ముగ్గురు తమను పట్టించుకోవడం లేదన్నారు. అనారోగ్యం బారిన పడి అవస్థలు పడుతున్నా తమ బాగోగులు చూసుకున్న చిన్న కుమార్తెకు తమ వద్ద ఉంచుకున్న భూమి విక్రయించడంతో మిగితా కుమార్తెలు తమపై దాడికి దిగుతున్నారన్నారు. యోగక్షేమాలు చూడని కుమార్తెల గిఫ్ట్ డీడ్ భూమి రద్దు చేసి న్యాయం చేయాలని కోరారు.

తాగిన మైకంలో పొలంలో పడి వ్యక్తి మృతి

రాయపర్తి: తాగిన మైకంలో వ్యవసాయ పొలంలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని కొండూరులో గురువారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై బండారి రాజు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బక్క శ్రీను(30) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం సాయంత్రం తన వ్యవసాయ పొలంలో బర్రెకు నీళ్లు తాగించేందుకు వెళ్లి పొలంలోనే పడిపోయాడు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అటుగా వెళ్లిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో అక్కడికి వెళ్లి చూసే సరికి మృతి చెంది ఉన్నాడు.

అప్పు తీసిన నిండు ప్రాణం

- అప్పు తీసిన నిండు ప్రాణం
- కడిపికొండ రైల్వే ఉద్యోగిపై గొడ్డలితో దాడి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

కాజీపేట అర్బన్: అప్పు నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. కడిపికొండలోని గురువారం తెల్లవారు జామున ఇచ్చిన అప్పు తిరిగి చెల్లించమన్నందుకు సదరు వ్యక్తి గొడ్డలితో దారుణంగా హత్య చేశాడు. మండికొండ సీఐ వేణు, ఎస్సై నర్సింగరావు కథనం ప్రకారం.. కడిపికొండకు చెందిన జిర్ర ప్రదీప్(27) కాజీపేట ఎలక్ట్రికల్ లోకో షెడ్‌లో రైల్వే ఉద్యోగిగా విధులు కొనసాగిస్తున్నాడు. ప్రదీప్ సమీప బంధువైన పెసరు వినయ్‌కి నాలుగేళ్ల క్రితం రూ.5 లక్షలు అప్పుగా ఇచ్చాడు. ఏళ్లు గడుస్తున్నా ఇవ్వటం లేదు. తనకు ఉన్న భూమిని అమ్మి ఇస్తానని నమ్మబలికాడు. ఇటీవల వినయ్ తన భూమిని అమ్ముకున్నాడు. అయినా కూడా ప్రదీప్‌కు ఇవ్వాల్సిన రూ.5లక్షల అప్పు తిరిగి ఇవ్వలేదు. దీంతో మృతుడు ప్రదీప్ బుధవారం సాయంత్రం 6 గంటలకు డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో నుండి భార్య శ్రావణి, తల్లి ఉపేంద్రకు చెప్పి వెళ్లాడు. రాత్రి 9గంటలకు భార్య శ్రావణికి ఫోన్ చేసి వినయ్‌తో ఫోన్‌లో డబ్బుల విషయమై గొడవ జరిగిందని తెలిపాడు. ఇవ్వాల్సిన డబ్బులను తిరిగి ఇవ్వమని అడిగినందుకు పథకం ప్రకారం ప్రదీప్‌పై దాడి చేసేందుకు పెసరు వినయ్ తన మిత్రుడు కాసరబోయిన గోపితో కలిసి కడిపికొండ నుంచి అయోధ్యపురం వెళ్లేదారిలో బుధవారం అర్ధరాత్రి గొడ్డలితో దాడి చేసి ముళ్లపొదల్లో ప్రదీప్‌ను పడేశారు. గురువారం ఉదయం ప్రదీప్ భార్య శ్రావణి ప్రదీప్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అయోధ్యపురం వైపు వెళ్తున్న స్థానికులు ముళ్లపొదల్లో వ్యక్తిని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే తల్లి, భార్య అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ప్రదీప్ మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


జిర్ర ప్రదీప్(ఫైల్)

వైరల్‌గా మారిన వీడియో..

ముళ్లపొదల్లో పడి ఉన్న ప్రదీప్‌ను గుర్తించిన స్థానికులు, బంధువులు ఘటన ఎలా జరిగిందనే విషయాన్ని ప్రదీప్‌ను అడుగగా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ వినయ్, గోపిలు దాడి చేశారని తెలిపాడు. ప్రదీప్ చివరి క్షణంలో తెలిపిన మాటల వీడియో వైరల్‌గా మారడమే కాక మరణ వాంగ్మూలంగా మారిపోయింది. చనిపోయిన కొడుకుపై పడి తల్లి ఉపేంద్ర కొడుకా నీకు నిండు నూరేళ్లు నిండిపోయాయా మేము ఎలా బతకాలని ఏడ్చిన తీరు పలువురిని కలచి వేసింది.

విద్యానగర్‌లో దొంగల సంచారం..

- విద్యానగర్‌లో దొంగల సంచారం..
- కారు చోరీకి యత్నం.. పట్టుకున్న కాలనీవాసులు

ఖిలా వరంగల్: వరంగల్ 39వ డివిజన్ ఫోర్ట్‌రోడ్డు విద్యానగర్‌లో రాత్రి సమయంలో దొంగల సంచారం ఎక్కువైంది. ఇటీవల ఫోర్ట్‌రోడ్డు–1, 2 వీధుల్లో పగలు, రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తుండడాన్ని గమనించిన స్థానికులు అప్రమత్తం ఆయ్యారు. బుధవారం రాత్రి కాలనీ కమిటీ ప్రతినిధులు స్థానిక ప్రజల సహకారంతో మట్టేవాడ రజినీష్, తడక చంద్రమౌళి, రవి, రాజేష్ టీమ్‌గా ఏర్పడి రోడ్డుపై నిఘా వేశారు. 12.40గంటలకు వాహనాల దొంగలు కాలనీలోకి ప్రవేశించి ఓ కారును స్టార్ట్ చేసే క్రమంలో స్థానికుల రాకను గమనించి ముగ్గురు పారిపోగా ఒక్కరు పట్టుపడ్డారు. అతనికి దేహశుద్ధి చేసి గురువారం తెల్లవారు జామున 2గంటలకు మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు కాలనీ ప్రతినిధి ఎనుకంటి రాజు తెలిపారు.

పల్లగుట్టలో పట్టపగలే..

చిల్పూర్: మండల పరిధిలోని పల్లగుట్టలో గురువారం పట్టపగలే ఇంటి తాళాలు పగులగొట్టి బంగారంతో పాటు కొంత నగదును గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడు వేల్పుల కుమార్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కుమార్ రోజు మాదిరిగానే ఉదయం భార్యతో కలిసి ఇంటికి తాళం వేసి వ్యవసాయ భావి వద్దకు వెళ్లారు. సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి రాగా తలుపులు తీసి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లగా వస్తువులు చిందరవందరంగా కనిపించాయి. వారు దాచుకున్న 3 తులాల బంగారంతో పాటు కొంత నగదు పోయినట్లు తెలిపారు. వెంటనే స్థానికి ఎస్సై బొల్లం వినయ్‌కుమార్‌కు సమాచారం అందించగా అక్కడికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశాడు.


పట్టుబడిన దొంగ

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

బిల్డింగ్ అమ్మబడును

■ **వరంగల్, కరీమాబాద్, ఉర్సు దగ్గరలో** మేయిన్‌రోడ్‌కు తూర్పు ఫేస్ గల 200 గజాల బిల్డింగ్ అమ్మబడును. సంప్ర: 9347219693, 9849459661 [W-775814]

SERVICES

■ **బాలాజీ గోల్డ్ :** మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును (స్పాట్ క్యాష్), తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 90320 40019. [T-1746]

LOANS

■ హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ వారికి ఆర్థిక సహాయం చేయబడును సెల్: 7569519258 హన్మకొండ. [WA-6471]

BUSINESS OFFER

■ ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. ఫోన్ : 9034974058 [H-792913]

ఆయుర్వేదం

■ బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్ర: 9603055647, 7995392747 [G-932]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

WANTED

■ వరంగల్‌లోని చికెన్ సెంటర్‌లో పని చేయుటకు అనుభవం గల చికెన్ కట్టర్ కావలెను. జీతం 18000+రూం+ భోజనం ఫ్రీ. సంప్ర॥ 6281342090, 9949857816. [WA-6469]

■ శ్రీకృష్ణ హోమ్‌కేర్ (Govt. Reg.) Hyd లో వృద్ధులకు, పేషెంట్లకు సెవచేయుటకు బేబీకేర్, ఇంటి/వంటపనికి స్త్రీలు/పు॥ కావలెను (ఎజెంట్లకు మంచి కమీషన్) జీ: 15,000- 25000/ - రూం+భో॥ ఫ్రీ. ఫోన్ : 9000448989. [H-793506]

■ **Wine Shop** లో పనిచేయుటకు వర్కర్స్ కావలెను. హసన్‌పర్తి మరియు కమలాపూర్. సంప్రదించండి. సెల్: 9182922080. [WA-12458]

■ ప్రముఖ కుబోట ట్రాక్టర్ డీలర్‌షిప్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేయుటకు ట్రాక్టర్ ఫీల్డ్‌లో కనీస అనుభవం కలిగిన వారు కావలెను. ఆకర్షణీయమైన జీతం+ఇన్సెంటివ్స్. సెల్: 9398680229 [WA-12461]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779876]

■ **Need Marketing Executives / Managers to meet Schools for book Publishers Salary 15000 -30000/ PM Call:8919641609** [H-793268]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9505507558
9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9505507558
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198